క్లుప్తంగా

బాగున్నారా.. మాస్టారు



రిటైర్డు హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డిని పలకరిస్తున్న గౌరీ శంకర్

నడిగూడెం : తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ శనివారం మండలంలోని కాగితరామచంద్రాపురంలో 45 ఏళ్ల క్రితం తనకు పాఠాలు బోధించిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు అట్లూరి సత్యనారాయణరెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. మాస్టారు బాగోగులు అడిగి తెలుసుకుని, నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గౌరీశంకర్ బాల్య మిత్రుడు ఎండీ.ఖలీల్ అహ్మద్ ఉన్నారు.

వృద్ధురాలికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో ఒంటరి మహిళ, వృద్ధురాలు బూరుగ తిరుపమ్మకు అవ్యక్త్ సత్య ఫౌండేషన్ చైర్మన్ బెల్లంకొండ ఆంజనేయులు చేయూతనందించారు. తిరుపమ్మ గత మూడు రోజులుగా తినడానికి తిండి లేని పరిస్థితుల్లో ఉండగా విషయం తెలుసుకున్న ఆయన రూ.5 వేల విలువ గల నిత్యావసర సరుకులు, రూ.2 వేల విలువ ఫ్యాన్‌ను శనివారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రామినేని వీరబాబు, వెంకటేష్, సాయిప్రసన్న, మండవ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో ఇఫ్తార్ విందు

నడిగూడెం : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని మదీనా మసీదులో ముస్లింలకు బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం సీనియర్ నాయకుడు షేక్.ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మదీనా మసీదు ఇమాం ఖలీలుద్దీన్, మక్కా మసీదు ఇమాం షఫీ, నాయకులు లతీఫ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మినీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు ముక్కా యల్లయ్య, చేపూరి సైదులు, హసన్‌మియా, బెల్లంకొండ కోటయ్య, సోమయ్య, బాలెబోయిన రాంబాబు, జానివి ంయా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్రం చిత్రీకరణ

కోదాడఅర్బన్ : యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దనే సందేశంతో దర్శకుడు తిరుప్ ఏర్పుల నిర్మిస్తున్న లఘు చిత్రంలోని ఓ సన్నివేశ చిత్రీకరణను శనివారం స్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద రాష్ట్ర స్థాయి రంగస్థల నటుడు గురు లింగం క్లాప్ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్మాత దేవరకొండ రమేష్, నటీనటులు పవన్, స్వాతి, గాధరి మధు, గడుపురి ఏసుపాదం, కుడుముల ప్రశాంత్, లక్ష్మి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నాగేశ్వరరావు ఎన్నికపై హర్షం

హుజూర్‌నగర్ : హైకోర్టు బార్‌కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లె నాగేశ్వరరావు ఎన్నిక పట్ల హుజూర్‌నగర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇట్టిమళ్ల బెంజిమెన్, శ్రీను, మంగయ్య, వెంకటేశ్వర్లు, పున్నయ్య, రంజిత్, సామేలు, కోటమ్మ, యోహాన్, జానకిరాములు, వీరస్వామి, లక్ష్మయ్య, బెనర్జి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

దాస్ మృతి పార్టీకి తీరని లోటు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు జిల్లా దాస్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా కమిటీ సభ్యులు జుట్టుకొండ బసవయ్య, దేవరం వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ, ముత్యాలు, పద్మావతి తదితరులు నివాళులర్పించారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీలలో జరిగే ఐఎఫ్‌టీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టీ.కుమార్ కోరారు. శనివారం మండలంలోని శ్రీనివాసపురంలో ఆ సంఘం సమావేశం నిర్వహించి ప్రచార యాత్ర చేపట్టారు. సర్పంచ్ రమ్యా నాగరాజు, నాయకులు లింగయ్య, సైదులు, జనార్దన్, పున్నయ్య, బాబు, నరసింహారావు, చంద్రయ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.

కూచిపూడి రోడ్డుకు మోక్షం

- 5.2 కిలోమీటర్ల రహదారికి రూ.1.80 కోట్ల నిధులు మంజూరు
- పనులు ప్రారంభించిన అధికారులు
- తొలగనున్న ప్రజల ఇబ్బందులు



తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వరకు కొనసాగుతున్న మెటల్ పనులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వరకు 5.2 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 కోట్ల నిధులను మంజూరు చేయడంతో అధికారులు పనులు ప్రారంభించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే కూచిపూడి, కూచిపూడితండాతో పాటు మేళ్లచెరువు మండలంలోని పలు గ్రామాలు రాష్ట్ర సరిహద్దులో ఉన్న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మరికొన్ని గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు దూరభారం, వ్యయప్రయాసలు తగ్గుతాయి.

ఏడేళ్లుగా ఇబ్బందులు..

తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వరకు గల రోడ్డు ఏడేళ్ల కిందట నుంచి గుంతలు పడుతూ ప్రస్తుతం మోకాలిలోతు గుంతలతో పూర్తిగా ధ్వంసమైంది. గత నాలుగేళ్లుగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. పంచాయతీరాజ్ శాఖ కింద ఉన్న రోడ్డు మూడేళ్ల కిందట ఆర్‌అండ్‌బీ శాఖలోకి మారింది. అయినా ఆ తర్వాత అధికారులు పలుసార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో ఆ రోడ్డు నిర్మాణంపై ఆశలు వదులుకున్నారు. ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు రామాపురం క్రాస్ రోడ్ మీదుగా చుట్టూ తిరిగి కోదాడకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు పూర్తయితే 13 కిలో మీటర్లు ప్రయాణించి కోదాడకు చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ రోడ్డు బాగోలేకపోవడంతో 20 కిలోమీటర్లు ప్రయాణించి కోదాడకు వెళ్తున్నామని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు రావడం రోడ్డు పనులు కొనసాగుతుండడంతో త్వరలో ప్రజలకు సౌకర్యవంతంగా మారనుంది.

దూరభారం తగ్గుతుంది



కూచిపూడి రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో కోదాడకు వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రత్యేక చొరవతో మా గ్రామ రహదారికి నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు పూర్తి అయితే వాహనదారులకు దూరభారం తగ్గుతుంది.

– శంకరశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ, కూచిపూడి

15 రోజుల్లో పనులు పూర్తిచేస్తాం

తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వరకు గల రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాం. ప్రస్తుతం రోడ్డుపై మెటల్ పరిచే వర్క్ జరుగుతుంది. 15 రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు మొత్తం పూర్తిచేస్తాం.

– సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, కోదాడ

అట్టహాసంగా ఎద్దుల పందేలు ప్రారంభం



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్



బండను లాగుతున్న గిత్తలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎద్దుల పందేలను శనివారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ పోటీలను ప్రతిరోజు రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించి వెంటనే నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా తొలిరోజు గుంటూరు, కృష్ణ, కర్నూలు, సూర్యాపేట తదితర జిల్లాలకు చెందిన నాగుపండ్ల విభాగం గిత్తలు హోరాహోరీగా తలపడ్డాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్పయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ రామచంద్రయ్య, బాబునాయక్, రవీందర్‌రెడ్డి, నాగుల్మీరా, జమీల్, సీతారామిరెడ్డి, అచ్చయ్య, సామేలు, అప్పారావు, భద్రారెడ్డి యాదగిరి కోటయ్య, తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కూచిపూడిలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కూచిపూడిలో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన షటిల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ శెట్టి సురేష్, హెచ్‌ఎం సుధాకర్‌రావు, రామాంజి, ముత్యం, రవీందర్, ఉపేందర్, లక్ష్మా, వెంకటరమణ, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

కాపుగల్లులో..

మండలంలోని కాపుగల్లు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 40 మందికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ముత్తవరపు వీరయ్య, కాసాని రామారావు, నరేష్, ఉదయ్‌భార్గవ్, వీరబాబు తదితరులు ఉన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

మేళ్లచెరువు : మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి, ఈదురు గాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటలను మండల వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ శనివారం పరిశీలించారు. మేళ్లచెరువు, రేవూరు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ 352 ఎకరాల్లో మొక్క జొన్న, 52 ఎకరాల్లో జొన్న, 89 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. పంట నష్టాన్ని జిల్లా కలెక్టర్, వ్యవసాయాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్‌గౌడ్, రైతులు

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

కోదాడరూరల్ : గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శనివారం పట్టణంలోని 31వ వార్డులో హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడపగడపకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పాలూరి సత్యనారాయణ, బాల్‌రెడ్డి, ఖాసీం, తోట శ్రీను, భాగ్యరాజ్, యాకుబ్, సుధాకర్, శంకరాచారి, గాలి శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

7న ఆత్మీయ సమ్మేళనం

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో ఈనెల 7వ తేదీన నిర్వహించబోయే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ కోరారు. శనివారం మండలంలోని గడ్డిపల్లి, కుతుబ్షాపురం, చినగారకుంటతండా, కొనాయిగూడెం, వెలిదండ, రంగాపురం, కొత్తగూడెం, కీతవారిగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మేకల స్రవంతి, శోభన్‌బాబు, మాశెట్టి శ్రీహరి, గంటా సుధాకర్‌రెడ్డి, శ్రీనునాయక్, సుధాకర్ నాయక్, సర్పంచ్ నల్లపాటి వీరమ్మ, భాస్కర్, ఎంపీటీసీ ఆకుల అరుణ, సతీష్, పార్థసారధి, కోటయ్య, విజయరవి, స్వామి పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

మోతె : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో జరిగిన మేదరమెట్ల సావిత్రమ్మ సంతాప సభలో ఆయన పాల్గొని సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు శీలం సైదులు, ఆరె లింగారెడ్డి, రవి, నూకల శ్రీనివాసరెడ్డి, కొండపల్లి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాస్‌కు ఎమ్మెల్యే నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జిల్లా దాస్ గుండెపోటుతో మృతి చెందారు. శని వారం ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గుడిబండలో మృతి చెందిన అర్వపల్లి రాంబాయమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, శ్రీనివాసరావు, పాపారావు, సలీం, గీత ఉన్నారు.



కోదాడరూరల్ : దాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కళాకారులకు ఆహ్వానం

హుజూర్‌నగర్ : తిరుపతిలో నిర్వహించే సాహితి బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు హుజూర్‌నగర్‌కు చెందిన పలువురు రంగస్థల కళాకారులకు ఆహ్వానం అందినట్లు కళాకారులు కంబాల శ్రీనివాస్, కొట్టు బాబు శనివారం తెలిపారు. ఏప్రిల్ 9, 10 తేదీలలో జరిగే కార్యక్రమాలలో కళాకారులు పాల్గొంటారని వారు చెప్పారు.

నాగభూషణచారి మృతి బాధాకరం

మునగాల : మండల కేంద్రానికి చెందిన మారోజు నాగభూషణాచారి మృతి బాధాకరమని విశ్వకర్మ, మాతృ సంఘం మండల అధ్యక్షుడు బంగారపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో అనారోగ్యంతో నాగభూషణాచారి మృతిచెందగా శనివారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీ నాగార్జునచారి, ధనాల కోట నాగమణి, నాయకులు వెంకటప్పాచారి, ముత్యాల శివ, అన్నపూర్ణమ్మ నివాళుర్పించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదవ తరగతి విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం ఉదయశ్రీ కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయుడు తాతారాజు శ్రీనివాస్ తల్లి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, తెలుగు పండిట్ పి.దీనారాణి పెన్నులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మాతంగి ప్రభాకర్‌రావు, ఉపేందర్, శేషగిరి, అన్వేష్, అరుణారాణి, వెంకటేశ్వర్లు, వసంతరావు, రవీందర్‌రెడ్డి, అశోక్, జానిబేగం, శేఖర్, మున్ని తదితరులు పాల్గొన్నారు.

5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ

హుజూర్‌నగర్ : సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న ఢిల్లీలో నిర్వహించబోయే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సోమయ్య కోరారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని దీంతో పేదవాడు పేదరికంలోకి, ఉన్నవారు మరింత ఉన్నవారిగా మారుతున్నారని దీనికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, టి.రాములు, ముస్తఫా, వెంకన్న, నరేష్, గోవిందు, నాగుల్ మీరా, జానిమియా, బుజ్జి వెంకన్న వీరస్వామి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

శశిధర్‌రెడ్డి పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కామాటీ లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకుమందు వేణుగోపాలపురంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బొలిశెట్టి నాగేంద్రబాబు, కాసాని వెంకన్న, దున్నా ప్రవీణ్, గుండు విజయరామారావు, మహ్మద్ రఫీ, దున్నా అర్జున్, దున్నా లింగయ్య ఉన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సిద్ధం

నేరేడుచర్ల : ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల చీఫ్ సుపరింటెండెంట్ ఎల్. శ్రీనివాస్‌రావు, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో హాల్ టికెట్ నెంబర్లు వేసే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. నేరేడుచర్లలో మూడు పరీక్ష కేంద్రాల్లో 608 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది, ప్రగతి విద్యాలయంలో 199 మంది, శ్రీవాణి పాఠశాలలో 191 మంది హాజరు కానున్నారని అన్నారు. మూడు పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సుపరింటెండెంట్‌లు ముగ్గురు, డిపార్ట్‌మెంటు అధికారులు ముగ్గురు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.



హుజూర్‌నగర్ : పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు



నడిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వరరావు

పరీక్ష కేంద్రాల తనిఖీ

మఠంపల్లి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం ఎంపీడీఓ జానకిరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవీ హైస్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మేళ్లచెరువు : రేపటి నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ సైదానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళ్లచెరువులో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 44 మంది ఇన్విజిలేటర్లు, నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డబుల్ డెస్క్ బెంచీలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు వంటివి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో 4 పరీక్ష కేంద్రాలలో 760 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈఓ సైదానాయక్ తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను శనివారం మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణవేణి స్కూల్‌లో 160 మంది, వీవీఎం 200 మంది, శ్రీ చైతన్యలో 200 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలలో ఇన్విజిలేటర్లు 45 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు నలుగురు, డీఓలు నలుగురు విధులు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎస్‌ఐ వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు ఉన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నడిగూడెం : ఈ నెల 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ టి.నాగేశ్వరరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షల విభాగం సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలుర ఉన్నత పాఠశాలలో 135 మంది, బాలికల గురుకుల పాఠశాలలో 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్‌ఐ.ఏడుకొండలు, ఎంపీఓ ఎర్రలింగారెడ్డి, పరీక్షల నిర్వాహకులు పాల్గొన్నారు.

మోతె : రేపటి నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు మోతె, మామిళ్లగూడెంలలో పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కె.గోపాల్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 171 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మోతె జెడ్పీహెచ్‌ఎస్‌లో 106 మంది, మామిళ్లగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 65 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాల ఏర్పాట్లను స్థానిక తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీఓ వెంకటాచారి, తదితర సిబ్బంది పరిశీలించారని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తూ నల్ల చట్టాలను తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, అర్హులైన కార్మికులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు పెద్ద మస్తాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు యడవల్లి వెంకటేశ్వర్లు, ఆనందరావు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్, నందిపాటి వినోద్, నకిరేకంటి రవి, వెంకటేష్, నాగయ్య, తిరుపతయ్య, శ్రీనివాస్, వీరయ్య, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిపురం సుధాకర్‌రెడ్డి

టాలెంట్ టెస్ట్‌లో 'ఎండీఆర్' ప్రతిభ

హుజూర్‌నగర్ : ఆల్ ఇండియా మాథ్స్, సైన్స్ (ఏఐఎంఎస్) టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని ఎండీఆర్ హైస్కూల్ విద్యార్థులు మొదటి నాలుగు ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి, హెచ్‌ఎం నలబోలు భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాలలో నిర్వహించిన ఈ పరీక్షలలో దాదాపు 513 మంది విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులకు 1, 2, 3, 4 ర్యాంకులు వచ్చినట్లు చెప్పారు. ఎ.జీవన శ్రీ ఒకటవ ర్యాంక్, పూజ శ్రీ రెండవ ర్యాంక్, నిషిత మూడవ ర్యాంక్, బి.ఉమేష్‌చంద్ర నాలుగవ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. వారితో పాటు పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అంతేకాకుండా స్పోర్ట్స్ మీట్స్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఓ పింగళి నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో చైర్మన్, హెచ్‌ఎం

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన



చిలుకూరు : పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ



మునగాల : ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ

మునగాల : మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల వినియోగంపై సిబ్బంది, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోదాడ ఐసీడీఎస్ సీడీపీఓ విజయచంద్రిక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందచేయాలన్నారు. అనంతరం స్వస్థ బాలక్, స్పర్ధ కార్యక్రమంలో భాగంగా హెల్తీ బేబీ సర్టిఫికెట్ అందజేశారు. మోడరేట్ నుంచి నార్మల్‌కు వచ్చిన చిన్నారులకు సర్టిఫికెట్లు, ప్రీస్కూల్‌లో 100 శాతం హాజరు కలిగిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ కొప్పుల వీరమ్మ, ఎంపీటీసీ గడ్డం ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

చిలుకూరు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. శనివారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వా డీ టీచర్లు పోషక విలువలు గల వంటకాలను ప్రదర్శించారు. ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండుయాదవ్, సర్పంచ్ కొడారు బాబు, ఆర్ఐ మంజుల, సూపర్‌వైజర్ సునీత, కార్యదర్శి శోభన్‌బాబు, ఏపీఎం దుర్గాప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీ నివాస్, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నడిగూడెం : ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురై వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన శనివారం నడిగూడెం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లం వెంకటేశ్వర్లు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని కోదాడ ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురైంది. దీంతో క్రమేపీ మంటలు ఎగసి పడడంతో ఇల్లంతా మంటలు వ్యాపించారు. కట్టుకున్న బట్టలు తప్ప అన్నీ దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో దాదాపు రెండు లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.



దగ్ధమైన ఇంట్లోని వస్తువులు